ముమ్మరంగా ఆస్పత్రి పనులు

- తుంగతుర్తి ప్రజలకు త్వరలో అందనున్న 100 పడకల ఆస్పత్రి సేవలు
- ప్రస్తుతం మూడో అంతస్తు దశలో కొనసాగుతున్న పనులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ ఏరియా ఆస్పత్రి లేక ఈ నియోజకవర్గ ప్రజలు దూర ప్రాంతంలో ఉన్న సూర్యాపేట, ఖమ్మం, హైదరాబాద్, వరంగల్‌లోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. తుంగతుర్తిలో ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి అయితే ఇక్కడ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ నియోజకవర్గంలోని తుంగతుర్తి, నాగారం, అర్వపల్లి, తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

నిధుల మంజూరు ఇలా..

గత ప్రభుత్వం ఆస్పత్రి భవన నిర్మాణం కోసం రూ.35 కోట్లు మంజూరు చేయించింది. తర్వాత ప్రభుత్వం మారడంతో నూతన ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే మందుల సామేల్ పనులను ప్రారంభించారు. అయితే గ్రౌండ్ లెవెల్ వరకు బిల్డింగ్ పూర్తి కాగానే నిధులు రాక నిర్మాణం ఆగిపోయింది. వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకొని అసెంబ్లీలో కొట్లాడి నిధులు మంజూరు చేయించగా.. కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేశారు. ప్రస్తుతం మూడవ అంతస్తు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.



తుంగతుర్తిలో నిర్మాణ దశలో ఉన్న ఆస్పత్రి భవనం

నిధులు రావడంలో ఆలస్యం..

ఇప్పటివరకు బిల్డింగ్ నిర్మాణం కోసం కేవలం ఒక కోటి 20 లక్షల రూపాయలు మాత్రమే విడుదలయ్యాయని ప్రాజెక్టు మేనేజర్ తెలిపారు. మొత్తం మూడు బిల్లులు పెట్టగా కేవలం ఒక బిల్లు డబ్బులు మాత్రమే అందినట్లు పేర్కొన్నారు. ఈ నెల చివరి వరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే బిల్డింగ్ నిర్మాణం పనులు ఆపివేస్తామని తెలుపుతున్నారు.

ఆస్పత్రిలో స్పెషాలిటీ సేవలు..

తుంగతుర్తి ఆస్పత్రి100 పడకల ఆస్పత్రిగా మారుతుండడంతో వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయి. 42 మంది వైద్యులు, 60 మంది స్టాఫ్ నర్సులు వస్తారు. వీరితో స్పెషాలిటీ సేవలు అందుతాయి. ఆపరేషన్లు, పిల్లల ఐసీయూ, ఆర్థోపెడిక్, పిల్లల వైద్యులు, పెద్దల ఐసీయూ, గైనకాలజిస్ట్, డయాలసిస్, పోస్టుమార్టం ప్రత్యేక డాక్టర్లు, ఎమ్మెల్సీ సేవలు, ఆరోగ్యశ్రీ సేవలు వీటితోపాటు మరికొన్ని సేవలు అందనున్నాయి.

ఆస్పత్రిలో స్పెషాలిటీ సేవలు అందుతాయి



"తుంగతుర్తిలో నిర్మిస్తున్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం మూడవ అంతస్తు స్లాబు పూర్తి కావస్తుంది. భవన నిర్మాణం పూర్తయితే ప్రజలకు స్పెషాలిటీ సేవలు అందుతాయి. దీంతో ప్రజలకు సమయభారం, ఆర్థిక భారం తగ్గుతుంది.

– డాక్టర్ నిర్మల్ కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

అందుబాటులోకి తీసుకురావాలి



"వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గతంలో నిర్మాణ పనులు కొంతకాలం ఆగాయి. అయితే ప్రస్తుతం మళ్లీ పనులు వేగంగా జరుగుతుండడం సంతోషకరమైన విషయం. ఆస్పత్రి నిర్మాణం త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– నవీన్, తుంగతుర్తి

క్లుప్తంగా

ఎన్నికల్లో సత్తా చాటాలి



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతా రెడ్డి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతా రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. మొత్తం 14 మంది బీజేపీలో చేరగా ఆమె వారిని పార్టీలోని ఆహ్వానించారు. కార్యక్రమంలో సుంకర లింగారెడ్డి, ఇస్లావత్ రవి, పారెల్లి మహేష్, బొల్లెపంగు కాషయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పునః ప్రారంభం



బోళ్లతండాలో పాఠశాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్

తిరుమలగిరి : మండల పరిధిలోని బోళ్లతండా ప్రాథమిక పాఠశాలను డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య మంగళవారం పునః ప్రారంభించారు. ఈ పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో మూడేళ్ల క్రితం మూతపడింది. గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తిరుమలగిరి, ఇతర ప్రాంతాల ప్రైవేట్ పాఠశాలలకు పంపుతుండటంతో పాఠశాలను మూసి వేశారు. అయితే ఈ విద్యా సంవత్సరం 12 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చేరడంతో పాఠశాలను పునః ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెలిశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి, ఆర్‌పి సుజిత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గంట ప్రదీప్, సీఆర్‌పీ కె.సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యాపేట మండల వాసికి అరుదైన అవకాశం



సాయి మాధురి

తాళ్లగడ్డ(సూర్యాపేట) : కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గుజరాత్‌లోని వాడ్‌నగర్ కేంద్రంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న ప్రేరణ కార్యక్రమానికి సూర్యాపేట రూరల్ మండలం ఇమాంపేట గ్రామానికి చెందిన అనుముల సాయి మాధురి ఎంపికైంది. ఈ నెల 8 నుంచి 14 వరకు జరిగిన ది ఎక్స్‌పీరెన్షియల్ లెర్నింగ్ ప్రోగ్రాం జాతీయ స్థాయి సెమినార్‌లో ఉపాధ్యాయురాలు కవితతో కలిసి పాల్గొంది. సెమినార్ నిర్వాహకులు డాక్టర్ గోపాల్ ఉపాధ్యాయ, అనిత గుప్తలు ఆమెకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు.

బేకరీకి జరిమానా

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని చర్చి కాంపౌండ్ రోడ్డులో డీమార్టు పక్కన గల ఎల్ఎస్ బేకరీలో సోమవారం సీతారాంపురం గ్రామానికి చెందిన వారు కేక్ తిని అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సిబ్బంది మంగళవారం ఎల్ఎస్ బేకరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను పరిశీలించగా బేకరీలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు ఉన్నట్లు తేలింది. దీంతో షాప్ యాజమాన్యానికి రూ.5000 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ లైసెన్స్ ఇన్‌చార్జ్ యాదగిరి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వార్డ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జవాన్లు విక్రమ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



జరిమానా విధిస్తున్న అధికారులు

భువన్ సర్వేకు సహకరించండి

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట అర్బన్ : భువన్ సర్వేకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 15వ వార్డు బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ బిల్ కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బంది మీ ఇళ్లకు వచ్చి ప్రస్తుతం ఉన్న ఇంటి కొలతలు తీసుకొని, కొలతల ప్రకారం పన్నుల హెచ్చు తగ్గులను నిర్ణయిస్తారని తెలిపారు. ఈ సర్వేకు వచ్చే సిబ్బందికి గృహ, వ్యాపార, వాణిజ్య సంస్థల వారు సహకరించి నిజమైన సమాచారం ఇవ్వాలని కోరారు. గృహ యజమానులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే రానున్న వర్షాకాలం దృష్ట్యా దోమలు వృద్ధిచెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతాయన్నారు. శిథిలావస్థలో ఉండి, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లి నివసించాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది గౌసుద్దీన్, మనోజ్ కుమార్, టీఎంసీ శ్వేత, వార్డ్ అధికారి మహ్మద్ రహీమ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, మహిళా సంఘం సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రపంచవ్యాప్తంగా వాసవీ క్లబ్ సేవలు

సూర్యాపేట అర్బన్ : ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్ ఇరుకుల రామకృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణంలో వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాటర్ ట్యాంకును బహూకరించి మాట్లాడారు. సూర్యాపేటలో 8 క్లబ్‌ల ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, పాఠశాలలకు వాటర్ ట్యాంకులు, వ్యాపార అభివృద్ధికి పేద ఆర్య వైశ్యులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా 104 ఏ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, సింగిరికొండ రవీందర్, తోట శ్యామ్‌ప్రసాద్, రాచర్ల కమలాకర్, గుండా శ్రీదేవి, బిక్కుమల్ల కృష్ణ, వెంపటి శబరి, డిస్ట్రిక్ ఇన్‌చార్జ్ గోసేవ మిట్టపల్లి రమేష్, వనితా క్లబ్ అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి, జేడీసీ బుద్ధ శ్రీనివాస్, సెక్రటరీ పాలవరపు భవాని, కోశాధికారి లకుమారపు పద్మజ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకును బహూకరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఇరుకుల రామకృష్ణకు సన్మానం

తాళ్లగడ్డ (సూర్యాపేట): వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన పలు సేవా కార్యక్రమాలకు హాజరైన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుక్కుల రామకృష్ణను పట్టణంలోని ఆర్యవైశ్య మహాసభ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

మంత్రి సీతక్కను కలిసిన కార్యదర్శులు



హైదరాబాద్‌లో మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

నాగారం : పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్‌ను పెంచి, పదోన్నతులకు మార్గం సుగమం చేస్తూ కేబినెట్‌లో ఆమోదించిన సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కను, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్‌లను మండల పంచాయతీ కార్యదర్శులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడారు. పెండింగ్ చెక్‌లను త్వరలో క్లియర్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క, ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్, మహిళా ఉపాధ్యక్షురాలు వాణి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విచారణ

పెన్‌పహాడ్ : మండల వైద్యాధికారి స్రవంతి, ఏఎన్ఎంలు పరస్పరం ఉన్నతాధికారులకు ఫి ర్యాదు చేసుకోవడంపై, అలాగే మండలంలోని వివిధ గ్రామాల ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఆర్థిక లావాదేవీల నిర్వహణపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి డిప్యూటీ డీఎంహెచ్ఓ కోటిరత్నం మంగళవారం పీహెచ్‌సీలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆరోగ్య ఉపకేంద్రాలకు వచ్చిన లావాదేవీల స్టేట్‌మెంట్‌లు, తీర్మానాలు, బ్యాంకు స్టేట్‌మెంట్ కాపీలు వారి వద్ద నుంచి తీసుకున్నామని తెలియజేశారు. ఏఎన్ఎంల వద్ద నుంచి వివరణ లేఖలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణ చేపట్టిన నివేదికలను డీఎంహెచ్ఓ ద్వారా కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు.

కేసు నమోదు

నూతనకల్: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కల్గించే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్ మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే కమీషన్లు దండుకుంటున్నారని తాళ్లసింగారం గ్రామానికి చెందిన జటంగి శ్రీశైలం తన సోషల్ మీడియా ద్వారా పోస్టులు పెడుతూ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కల్గించడంతో స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అయినా ఆ వ్యక్తి పలుమార్లు పోస్టులు పెట్టి ఎమ్మెల్యే గౌరవానికి భంగం కల్గిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సేవా దళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న రాంమూర్తియాదవ్

భానుపురి : రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని, ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వూర రాంమూర్తి యాదవ్ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసాలో భాగంగా రూ.9వేల కోట్లను రైతుల ఖాతాలో 9 రోజుల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు, కోటి 49 లక్షల ఎకరాల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పటేల్ రమేష్ రెడ్డి పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఉండ్రుగొండ, పిల్లలమర్రి వంటి ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వెలుగు వెంకన్న, జ్యోతి కరుణాకర్, వల్దాసు దేవేందర్, ఫరూక్, నిమ్మల వెంకన్న, తండు శ్రీని వాస్ గౌడ్, బంటు చొక్కయ్య, అంజయ్య, పిల్లల రమేష్ నాయుడు పాల్గొన్నారు.

రూ.1500కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గంలో గతంలో ఎవరూ చేపట్టని విధంగా ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.1500 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మందుల సూర్యకిరణ్, సామ అభిషేక్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సామేల్ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిపై కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో రూపొందించిన సీడీని మంగళవారం జాజిరెడ్డిగూడెంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, ఎల్సోజు నరేష్, వేల్పుల రమేష్, దాసరి సోమయ్య, చింతకుంట్ల వెంకన్న, బైరబోయిన సైదులు, జలేందర్, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, శ్రీధర్, మహరాజు, సత్యం, సైదులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



జాజిరెడ్డిగూడెంలో సీడీని ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

చివ్వెంల : దేశ వ్యాప్తంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాము వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టేందుకు కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. సివిల్ సప్లయ్ గోదాముల్లోని కార్మికులకు పెరిగిన ధలరకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా, పని భద్రత, ప్రమాద బీమా పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్పుల అమ్మయ్య, యేసు, నాగరాజు, వెంకన్న, వరుణ్, గోపాల్, శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించాలి



నాగారం ప్రాథమిక పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాగారం : దివ్యాంగ విద్యార్థులను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జ్ఞానేశ్వరచారి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మిళిత విద్యా దినోత్సవం (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్-డే)లో పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి విద్యార్థికి చదివే హక్కు ఉందన్నారు. సాధారణ పిల్లలతోపాటు వైవిధ్య సామర్థ్యాలున్న దివ్యాంగులను ఒకే పాఠశాలలో చేర్చి, సమాజంలో సమగ్రంగా ఏకీభవించేలా తీర్చిదిద్దాలన్నారు. దివ్యాంగ పిల్లలకు సహాయక సాధనాలు, ప్రత్యేక బోధనా పద్ధతులు ఉపయోగించి ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా పాఠ్యాంశాలను బోధించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం రాందాస్‌నాయక్, ఉపాధ్యాయులు వీరేష్, రమేష్, భాస్కర్, స్పెషల్ ఎడ్యుకేటర్లు మీనా, ఐఈఆర్పీ బాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

19న మండల స్థాయి పోటీలు

ఆత్మకూర్(ఎస్) : హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను నాలుగవ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక కోసం ఈ నెల 19న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ధారాసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో 23 నుంచి 26 వరకు, రాష్ట్రస్థాయిలో జూలై 1 నుంచి 5 వరకు మూడు అంచెల్లో ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం



తాళ్లగడ్డ : అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న వెన్నెల రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్



నూతనకల్ : బిక్కుమళ్లలో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్



సూర్యాపేట అర్బన్: అంగన్‌వాడీ కేంద్రంలో పలకలు పంపిణీ చేస్తున్న దాత శివకుమార్

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ప్రభుత్వం అంగన్‌వాడీల్లోని చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోందని ఉట్కూరి వెన్నెల రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని శాంతినగర్‌లో అమ్మ మాట – అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఉచితంగా పలకలు, ఆట బొమ్మలను అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయచంద్రిక మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీలో చేర్పించి వారి భవిష్యత్తుకు పునాదులు వేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కట్కూరి శిల్ప, అంగన్వాడీ ఆయా, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

సూర్యాపేట అర్బన్ : అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని సామాజిక సేవకుడు యార్కచర్ల శివకుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 29వ వార్డు తాళ్లగడ్డలోని అంగన్‌వాడీ సెంటర్‌లో, చౌదరి చెరువు కట్ట పాఠశాలలో యార్కచర్ల వెంకటయ్య జ్ఞాపకార్థం పిల్లలకు పలకలు, బలపాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ డి.జ్యోతి, ఆయా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిక్కుమళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో..

నూతనకల్ : మండల పరిధిలోని బిక్కుమళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులతారెడ్డి మాట్లాడారు. అమ్మమాట–అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమంలో భాగంగా ప్రీ స్కూల్ పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నేతకు పలువురి శుభాకాంక్షలు



జాజిరెడ్డిగూడెంలో మధుకర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అర్వపల్లి : కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం జాజిరెడ్డిగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ గుడిపల్లి సోమిరెడ్డి, గుడిపల్లి సులోచన, రాధికారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మందుల సూర్యకిరణ్, సామ అభిషేక్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, ఎల్సోజు నరేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, దాసరి సోమయ్య, తుంగతుర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఏఎంసీ డైరెక్టర్లు సైదులు, జలేందర్, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, దల్వాయి శ్రీధర్, బైరబోయిన మహరాజు, రింగు సత్యం, ఎడ్ల సైదులు, అమీనుద్దీన్, రవి, సోమయ్య, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నాగారం : నాగారం మండల పరిధిలోని పస్తాలలో గ్రామానికి చెందిన బొంకూరి సంపత్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో అతడికి ఎమ్మె ల్యే మందుల సామేల్ సహకారంతో ప్రభుత్వం నుంచి రూ.36,000 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బండగొర్ల కుమారస్వామి, బుక్క అంజయ్య, కండే అంజయ్య, వడ్లకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

చివ్వెంల : అక్రమంగా చెరువులో మట్టి తవ్వి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, జేసీబీని మంగళవారం తహసీల్దార్ ప్రకాశ్‌రావు సీజ్ చేశారు. గ్రామ శివారులోని ఊర చెరువు నుంచి అక్రమంగా జేసీబీ, మూడు ట్రాక్టర్లతో చెరువు మట్టిని తరలిస్తుండగా, గ్రామస్తులు అందించిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ సంఘటన స్థలానికి చేరుకుని, వాటిని సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన

తుంగతుర్తి : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ లింగమూర్తి అన్నారు. మంగళవారం కేశవాపురంలో క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలను వివరించారు. గ్రామంలో 21 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈఓలు తాడూరి వెంకన్న, రవికుమార్, వైద్యసిబ్బంది కిరణ్ కుమార్, గాజుల సోమన్న, యాదగిరి, నరసింహ చారి, ఏఎన్ఎంలు రజిత, నాగలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్, ఆశాలు రమా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నిక

అర్వపల్లి : కాసర్లపహాడ్ గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మాచర్ల మల్లయ్య రెండవ సారి ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా గుడిపాటి సైదులు, ఉప్పుల సొడయ్య, ఉప్పుల లింగరాజు, కోక వెంకన్న, చెరుకు రామనర్సయ్య ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను తుంగతుర్తి పాలశీతలీకరణ కేంద్రం సూపర్‌వైజర్ యల్లయ్య నిర్వహించారు.

20న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

నాగారం : పసునూర్ గ్రామంలో ఈ నెల 20న నిర్వహించే బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాల ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని మాదిగ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు, విగ్రహాల కమిటీ ఉత్సవాల ఫౌండర్ అండ్ చైర్మన్ మల్లేపాక అనిల్‌కుమార్ మాదిగ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విగ్రహాల ఆవిష్కరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతారని తెలిపారు.

సాండ్ ట్యాక్సీ విధానాన్ని పునరుద్ధరించాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని తుంగగూడెం ఇసుక రీచ్‌లో సాండ్ ట్యాక్సీ విధానాన్ని పునరుద్ధరించాలని ట్రాక్టర్ యజమానుల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ శ్రీకాంత్‌ను కలిసి విన్నవించుకున్నారు. ఈ విధానం కింద 230 ట్రాక్టర్లు ఇసుక సరఫరా చేస్తున్నాయని యజమానులు తెలిపారు. ఈ విధానం అకారణంగా నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ట్రాక్టర్ యజమానులు చెప్పారు.

మద్దిరాల తహసీల్దార్‌గా అయేషా పర్వీన్



అయేషా పర్వీన్

మద్దిరాల : మద్దిరాల తహసీల్దార్‌గా అయేషా పర్వీన్ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఆమె హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు డిప్యూటీ తహసీల్దార్ కంఠ్లమయ్య ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాధ్యతలు నిర్వహించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆత్మకూర్ (ఎస్) : తమతో కలిసి చదువుకున్న మిత్రుడు అకాల మరణం చెందడంతో తోటి విద్యార్థులు అందరూ కలిసి ఆ కుటుంబానికి అండగా నిలబడ్డారు. కందగట్ల గ్రామానికి చెందిన నెల్లుట్ల వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా 2004 – 05 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆ కుటుంబానికి ఎంతోకొంత సహకరించాలని తలిచారు. రూ.15వేలను సమకూర్చి వీరస్వామి తల్లికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల దేవరాజు, భోనగిరి వీరయ్య, కొడిదల ఆంజనేయులు, ఎల్లబోయిన బుచ్చయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

తిరుమలగిరి : రాష్ట్రంలో కాంగ్రెస్ హామీలు అమలుచేయడంలో విఫలమైందని, ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. మంగళవారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వై.ధీన్ దయాళ్, యాదగిరి, మూల వెంకట్‌రెడ్డి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, మూల వెంకన్న, కృష్ణానాయక్, కడియం మధు, రూపని వెంకన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట..

తిరుమలగిరి : బడి బాటలో భాగంగా మంగళవారం ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఐ.శాంతయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దామెర శ్రీనివాస్, అశోక్ రెడ్డి, ఐఈఆర్‌పీ వాణి, ఫిజియోథెరపిస్టు పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.